ఎన్‌వోసీల జారీ అధికారం డైరెక్టర్‌కు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల విదేశీ పర్యటనకు నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జారీ నిబంధనల్లో ప్రభుత్వం స్వల్పమార్పులు చేసింది. హెడ్మాస్టర్ల ఆరు నెలలలోపు విదేశీ పర్యటనలకు ఎన్‌వోసీల జారీ చేసే అధికారాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు కట్టబెట్టింది. ఇది వరకు హెచ్‌ఎంలు, ఇతర గెజిటెడ్ అధికారులకు మూడు నెలలలోపు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆరు నెలలపు పర్యటనలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఎన్‌వోసీలు జారీచేసేది. ఆ తర్వాత ఐదేండ్ల లోపు వరకు ప్రభుత్వం ఎన్‌వోసీలిచ్చేది. తాజాగా డీప్యూటీ ఈవోలు, అసిస్టెంట్ డైరెక్టర్లు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు ఆరు నెలలోపు పర్యటనలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఎన్‌వోసీ తీసుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత ఐదేండ్ల లోపు ఎన్‌వోసీ కోసం ప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

సీపీఎస్, యూపీఎస్‌ను ఒప్పకోం: యూటీఎఫ్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. ఏకీకృత పింఛన్ పథకాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టంచేశారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) ఆధ్వర్యంలో సీపీఎస్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో మహాధర్నా నిర్వహించారు. ఎస్టీఎఫ్ఐ ఉపాధ్యక్షుడి హోదాలో ధర్నాకు హాజరైన చావ రవి మాట్లాడుతూ.. ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేసి ఓపీఎస్‌ను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి జంగయ్య, నాగమణి, శ్రీనివాసాచారి, సృజన్‌కుమార్, ఎల్లయ్య, కిరణ్‌కుమార్ ధర్నాలో పాల్గొన్నారు.

ఇరిగేషన్‌లో వచ్చే ఏడాది భారీగా ఖాళీలు

ఈఎన్సీలు, సీఈలు సహా 68మంది విరమణ

హైదరాబాద్, నవంబర్29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సాగునీటి పారుదలశాఖలో వచ్చే ఏడాది భారీగా ఇంజినీర్లు విరమణ పొందనున్నారు. జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. ఇద్దరు ఈఎన్సీలు, ఏడుగురు చీఫ్ ఇంజినీర్లు, 15మంది సూపరింటెండెంట్ ఇంజినీర్లు, 27 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, 17 మంది డీఈఈలు ఉండడం గమనార్హం. ఇప్పటికే ఇద్దరు ఈఎన్సీలు, ఏడు సీఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బెటాలియన్స్ ఆర్‌ఐలకు త్వరలో బదిలీలు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 బెటాలియన్లలోని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల(ఆర్ఐ) బదిలీలకు రంగం సిద్ధమైంది. మూడేండ్లపాటు ఒకేచోట పనిచేసిన వారిని మరోచోటికి బదిలీ చేసేందుకు టీజీఎస్పీ బెటాలియన్స్ డీజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరికి మూడు చోట్ల ఎక్కడైనా పనిచేసేందుకు ఆప్షన్లు ఇచ్చారు. మూడేండ్లు పూర్తికాని ఆర్ఐలు వ్యక్తిగత, వైద్య కారణాలపై బదిలీ కావాలనుకుంటే వారు కూడా ట్రాన్స్‌ఫర్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తప్పడు వివరాల పిటిషనర్‌కు జరిమానా

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): తప్పుడు వివరాలతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుచేసిన వ్యక్తికి హైకోర్టు రూ.5వేలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సీఎం రిలీఫ్‌ఫండ్‌కు జమచేయాలని ఆదేశించింది. వయసు రీత్యా కఠినశిక్ష విధించకుండా వదిలిపెడుతున్నట్టు హెచ్చరించింది. సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో 1991నుంచి పనిచేస్తున్నా జీతం ఇవ్వడం లేదంటూ షేక్ జానీమియా హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. నాలుగు వారాల్లో వేతనం చెల్లింపులు చేయాలని గతంలో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయినా, జీతం చెల్లించడం లేదంటూ 2018లో కోర్టుధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై ఎస్పీ వినతి మేరకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. ఉత్తర్వులు అమలుకాని పక్షంలో విచారణకు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హాజరు కావాల్సి వస్తుందని హెచ్చరించింది. ఇటీవల ధిక్కరణ పిటిషన్‌ను విచారించారు. ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ వాదిస్తూ, పిటిషనర్ షేక్ జానీమియా పీఎస్‌లో ఉద్యోగమే చేయలేదని తెలిపారు. బోగస్ సర్టిఫికెట్లను సృష్టించారన్నారు. 2017లో పిటిషనర్ వాస్తవాలు దాచిపెట్టారని చెప్పారు. దీంతో పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు జరిమానా విధించింది.

పులి దాడిలో మహిళ మృతి

- గన్నారంలో పత్తి ఏరుతున్న మొర్లె లక్ష్మిపై పంజా..
- తీవ్రగాయాలతో కన్నుమూత
- కూలీలు కేకలు వేయడంతో పారిపోయిన పెద్దపులి
- డీఎఫ్‌వో కార్యాలయం ముందు మృతదేహంతో కుటుంబ సభ్యులు, రైతుల ధర్నా

కాగజ్‌నగర్ డివిజనల్ కార్యాలయం వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తేతెలంగాణ)/ కుమ్రంభీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కాగజ్‌నగర్, నవంబర్ 29 : పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపిన ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మొర్లె లక్ష్మి (22) మరో 20 మంది కూలీలతో కలిసి సమీపంలోని చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అందరూ పనిలో నిమగ్నం కాగా.. పెద్ద పులి ఒక్కసారిగా మొర్లె లక్ష్మిపై దాడి చేసింది. కూలీలు గట్టిగా కేకలు వేయడంతో పులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. లక్ష్మిని వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. బంధువులు, రైతులు లక్ష్మి మృతదేహంతో కాగజ్‌నగర్ డివిజనల్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్ష్మి మృతి చెందిందని, సెక్షన్, బీట్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ధర్నా విరమించబోమని భీష్మించుకు కూర్చున్నారు. హుటాహుటిన డీఎఫ్‌వో కార్యాలయానికి చేరుకున్న ఆదిలాబాద్ సీఎఫ్ శాంతారాం, ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి నీరజన్‌కుమార్ టిబ్రివాల్, ఎస్పీ శ్రీనివాసరావు మృతురాలి అంత్యక్రియల కోసం రూ. 20 వేలు, ఎక్స్‌గ్రేషియా కింద రూ. 10 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. మరో రూ. 10 లక్షలు అందించేందుకు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల భూమి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు మృతి

జిల్లాలో పులుల దాడుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగిడకు చెందిన విఘ్నేష్ చేపల వేటకు వెళ్లగా, పులి దాడి చేయడంతో మృతి చెందాడు. 2020 నవంబర్ 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల (15) పత్తి ఏరుతుండగా పెద్ద పులి దాడిచేసి చంపేసింది. 2023 నవంబర్ 16న వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము తన చేనులో పత్తి ఏరుతుండగా పులి పంజా విసరడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా.. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం గన్నారంలో పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపడం కలకలం రేపింది.

దడ పుట్టిస్తున్న దాడులు

ఉమ్మడి జిల్లాలో పులి దాడులు దడపుట్టిస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో నిత్యం పశువులపై దాడులు చేస్తున్నాయి. అటవీ సమీప గ్రామాల ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని వణికిపోతున్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి

యజమానికి పరిహారం అందజేస్తున్న ఎఫ్ఆర్వో

బోథ్, నవంబర్ 29 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం బాబెర తండాలో చిరుతపులి పిల్ల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని అవునూరి రమేశ్‌కు చెందిన పశువుల పాకలోని గొర్రెలు, మేకల మందపై గురువారం రాత్రి చిరుత పులి పిల్ల దాడి చేయగా రెండు గొర్రెలు, గొర్రె పిల్ల మృతి చెందాయి. ఓ మేకను తీవ్రంగా గాయపర్చి, మరో మేక పిల్లను ఎత్తుకెళ్లింది. మేకల అరుపులు విన్న రైతుతో పాటు చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో చిరుతపులి పిల్ల అటవీ ప్రాంతం వైపు పారిపోయింది. బాధితుడికి తక్షణ సహాయంగా రూ.4500 అందజేసినట్టు ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రణయ్ తెలిపారు.

దీక్షా దివస్‌పై సర్కార్ కుట్రలు

- బీఆర్ఎస్ ర్యాలీని అడ్డుకునేందుకు ఆటంకాలు
- స్పందనను చూసి ఓర్వలేకే స్ట్రీట్‌లైట్స్ బంద్
- బీఆర్ఎస్ నేత శ్రవణ్ ఫైర్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా దివస్‌పై కాంగ్రెస్ సర్కార్ చిల్లర కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని క్యాన్సర్ హాస్పిటల్ నుంచి తెలంగాణ భవన్ వరకు చేపట్టిన ర్యాలీకి అడుగడుగునా కావాలనే ఆటంకాలు కల్పించడం దుర్మార్గమని శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. కేటీఆర్, బీఆర్ఎస్ ముఖ్యనేతలు చేపట్టిన పాదయాత్రకు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్ట్రీట్‌లైట్లను బంద్ చేసిందని మండిపడ్డారు. ఈ పరిస్థితులను చూస్తుంటే ఉద్యమకాలంలో కాంగ్రెస్ చేసిన కుట్రలు గుర్తుకు వస్తున్నాయని, భవిష్యత్తులో కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి మిగిలేవి చీకటి రోజులేనని హెచ్చరించారు.

ప్రభుత్వ దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్యను బయటకు తీసుకొస్తున్న ఏసీపీ

బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు

- దవాఖానలో పండ్లు పంచుతుంటే పోలీసుల అడ్డగింత
- దీక్షాదివాస్ కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించే యత్నం

ములుగులో గులాబీ తోరణాలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

మంచిర్యాల, నవంబర్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దీక్షా దివస్ సందర్భంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మంచిర్యాల జనరల్ దవాఖానలో మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ పండ్లు పంపిణీ చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ జిల్లా అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సంబురాలు జరుపుకొంటున్న తరుణంలో బీఆర్ఎస్ జెండాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

దీక్షాదివస్‌కు అధికారుల ఆటంకాలు

ములుగురూరల్, నవంబర్ 29: ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి డివైడర్లకు బీఆర్ఎస్ నాయకులు గులాబీ జెండాలు, తోరణాలు కట్టగా మున్సిపల్ సిబ్బంది తొలగించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, మాజీ ఎంపీటీసీ పోరిక విజయ్‌రామ్‌నాయక్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి బీఆర్ఎస్ తోరణాల తొలగింపును ఖండించారు.

ఈ ఒక్క ఏడాదే ఇంటర్నల్ మార్కులు

- 'పది'లో గ్రేడింగ్ రద్దు మాత్రం యథాతథం
- గురువారం ఇచ్చిన ఉత్తర్వుల్లో స్వల్ప మార్పు
- గందరగోళం సృష్టించడంపై టీచర్ల సంఘాల మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): పదో తరగతిలో ఇంటర్నల్ మార్కుల రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం స్వల్పంగా సవరించింది. ఈ ఒక్క విద్యాసంవత్సరంలో ఇంటర్నల్ మార్కులను తిరిగి పునరుద్ధరిస్తున్నట్టు వెల్లడించింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం పాత ఉత్తర్వులను సవరించి కొత్త ఉత్తర్వులను విడుదల చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో గ్రేడింగ్‌ను రద్దు చేయడమే కాకుండా ఇంటర్నల్స్‌ను తొలగిస్తూ.. ఈ ఏడాదే నుంచే ఈ విధానాన్ని అమలుచేస్తామని ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. 80శాతం మార్కులకు బదులుగా 100శాతం మార్కులకు పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపింది. అయితే ఇప్పటికే సగం విద్యాసంవత్సరం గడిచిపోయింది. విద్యాసంవత్సరం మధ్యలో నిర్ణయాలను మార్చడంపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య సంఘాలు తప్పుపట్టాయి. దీంతో ఈ ఒక్క ఏడాదికి ఇంటర్నల్స్‌ను కొనసాగించాలని తాజాగా ఉత్తర్వులిచ్చారు. అయితే 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్నల్స్ ఉండవు. మొత్తం 100 మార్కులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తారు. అయితే గ్రేడింగ్ విధానం రద్దు విషయంలో తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదు. ఈ విద్యాసంవత్సరం నుంచే గ్రేడింగ్ ఉండదు. మార్కులనే కేటాయిస్తారు. ఇలా ఇంటర్నల్స్ రద్దు చేశామని ప్రకటించి ఒక రోజు గడవక ముందే ఇంటర్నల్స్ ఉంటాయని ఉత్తర్వులివ్వడం అటు టీచర్లను, ఇటు విద్యార్థులను గందరగోళానికి గురిచేసింది. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో గందరగోళం సృష్టించవద్దని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

గ్రేడింగ్‌ను కొనసాగించండి: ట్రస్మా

విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రభుత్వాన్ని కోరింది. మార్కుల విధానంతో విద్యార్థులపై ఒత్తిడి ఉంటుందని పేర్కొన్నది.

ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఆస్తులను అటాచ్

హైదరాబాద్, నవంబర్ 29(నమస్తే తెలంగాణ): మేనేజ్‌మెంట్ కోట సీట్లలో అక్రమాలకు పాల్పడ్డారంటూ మూడు ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్‌చేశారు. ఉద్దేశపూర్వకంగా పీజీ మెడికల్ కాలేజీలను బ్లాక్‌చేసి అమ్ముకున్నట్టు ఈడీ పేర్కొన్నది. ఇప్పటి వరకు ఈ కేసులో ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల విలువ మొత్తం రూ.9.71 కోట్లు. తదుపరి విచారణ పురోగతిలో ఉన్నట్లు ఈడీ వెల్లడించింది.

తెలంగాణ విద్యార్థిని 'రిషితేశ్వరి' ఆత్మహత్య కేసు కొట్టివేత

- గుంటూరు జిల్లా కోర్టు తుది తీర్పు
- తొమ్మిదేండ్లపాటు సుదీర్ఘంగా కొనసాగిన విచారణ
- నేరం నిరూపించలేకపోయారని కొట్టివేసిన న్యాయమూర్తి

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య కేసులో గుంటూరు జిల్లా కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ నేరం నిరూపించలేకపోయిందని పేర్కొన్న న్యాయస్థానం కేసును కొట్టివేసింది. తొమ్మిదేండ్లపాటు సుదీర్ఘంగా సాగిన విచారణ అనంతరం వెలువడిన కోర్టు తీర్పుపై రిషితేశ్వరి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాసిక్యూషన్ సరైన ఆధారాలు సమర్పించలేదని కోర్టు పేర్కొన్న నేపథ్యంలో.. రిషితేశ్వరి ఆత్మహత్య లేఖను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. వరంగల్ జిల్లాకు చెందిన రిషితేశ్వరి.. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సు చదివేది. అయితే, వర్సిటీలో ర్యాగింగ్, వేధింపుల కారణంగా 2015 జూలై 14వ తేదీన ఆమె ఆత్మహత్య చేసుకున్నది. ర్యాగింగ్ తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నట్టు సూసైడ్ నోట్‌లో రిషితేశ్వరి పేర్కొన్నది. రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన అప్పట్లో రెండు రాష్ర్టాల్లో తీవ్ర సంచలనం రేపింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేసిన పెదకాకాని పోలీసులు.. సూసైడ్ లెటర్ ఆధారంగా పలువురు నిందితులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ కేసులో తమకు న్యాయం చేయాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలుస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. తమకు పైకోర్టులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేదని, ప్రభుత్వమే సహాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగకపోతే మరణమే శరణ్యమని రిషితేశ్వరి తల్లిదండ్రులు తెలిపారు.

నేనిక్కడే ఉంటా.. ఎక్కడికీపోను!

- ప్రహసనంగా డీఈవోల బదిలీలు
- బదిలీచేసినా పాతస్థానాల్లోనే తిష్ట
- విద్యాశాఖ ఉత్తర్వులకు పాతర
- సీఎం రేవంత్ సొంత జిల్లాలో విస్తుపోయే ఘటనలు



హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఉన్నతాధికారుల అండదండలతో రాష్ట్రంలో కొందరు జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈవో) చెలరేగిపోతున్నారు. సర్కారు ఉత్తర్వులకు పాతరేస్తున్నారు. బదిలీ చేసినా ఉత్తర్వులను ఖాతరు చేయడంలేదు. కుర్చీ వీడేందుకు ససేమీరా అంటున్నారు. పాత స్థానాల్లోనే తిష్ట వేస్తున్నారు. బదిలీ ఉత్తర్వులను రద్దుచేయించేందుకు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నారు. మొత్తంగా డీఈవోల బదిలీల్లో విద్యాశాఖ డైరెక్టరేట్ ఇచ్చిన ఉత్తర్వులు అభాసుపాలవుతున్నాయి. విద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లానే ఇలాంటి విస్తుపోయే ఘటనలకు వేదికయ్యింది.

ఇవేం బదిలీలు..

నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలో ఫుడ్ పాయిజన్ ఘటన నేపథ్యంలో జిల్లా డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘనీని సస్పెండ్ చేస్తున్నట్టు అదనపు కలెక్టర్ ప్రకటించారు. కానీ ఆ మరోసటి రోజే తొలుత ఆయనకు వనపర్తి జిల్లా డీఈవోగా పోస్టింగ్‌నిచ్చారు. నాగర్‌కర్నూల్, వనపర్తి రెండు జిల్లాలకు డీఈవోగా పనిచేస్తున్న గోవిందరాజులును బదిలీచేసి నారాయణపేట, గద్వాల రెండు జిల్లాల డీఈవోగా పోస్టింగ్‌నిచ్చారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో తెలియదుకానీ గంటల వ్యవధిలోనే ఉత్తర్వులు మారిపోయాయి. మహ్మద్ అబ్దుల్ ఘనీకి వనపర్తితో పాటు గద్వాల జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతలప్పగించి, గోవిందరాజులును నారాయణపేట జిల్లాకు పరిమితం చేశారు. దీని వెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. మాగనూరులో మూడుసార్లు ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరిగినా ఇంకా నారాయణపేట డీఈవోగా అబ్దుల్‌ఘనీయే కొనసాగుతుండటం ఆందోళనకరమని స్థానికులు అంటున్నారు. ఇక గోవిందరాజులుపై గతంలో అనేక ఆరోపణలున్నాయి. ఓ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్‌సైన్స్)ను రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పోస్టులేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల సమన్వయకర్తగా నియమించారు. పాఠాలు చెప్పేందుకు టీచర్ లేకపోవడంతో సదరు ఫిజికల్ సైన్స్ టీచర్ పనిచేసే స్కూల్ విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. గోవిందరాజులు మహబూబ్‌నగర్ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. తాను బదిలీకాలేదని, నాగర్‌కర్నూల్‌లోనే ఉంటున్నట్టు కార్యాలయ వర్గాలతో చెప్పడం, వనపర్తి, నాగర్‌కర్నూల్ రెండు జిల్లాలకు డీఈవో బాధ్యతల నుంచి ఇంకా వైదొలగకపోవడం గమనార్హం.

ఒక్కరూ చేరలే..

డీఈవోల బదిలీల్లో భాగంగా జనగాం డీఈవో రామును బదిలీచేసి జగిత్యాల జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతలప్పగించారు. జగిత్యాలలోని జగన్మోహన్‌రెడ్డిని రాజన్న సిరిసిల్లకు, సిరిసిల్లలో ఉన్న రమేశ్‌కుమార్‌ను నాగర్‌కర్నూల్‌కు బదిలీచేశారు. బదిలీ ఉత్తర్వులు విడుదలయ్యి రెండు రోజులు గడిచిపోయింది. మంగళవారం వరకు ఒక్క డీఈవో కదిలితే ఒట్టు. ఒక డీఈవో కదిలితేనే మరో డీఈవో పోస్టులో చేరే అవకాశముంది. కానీ ఒక్కరు కూడా కదలకపోవడంతో ఇంతకు బదిలీ చేసినట్టా.. ? చేయనట్టా .. ? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మొత్తంగా అధికారులిచ్చిన ఉత్తర్వులు అమలుకాకపోవడం, ఉన్నతాధికారులిచ్చిన ఉత్తర్వులను జిల్లా స్థాయి అధికారులు ఖాతరు చేయకపోవడం విద్యాశాఖ పనితీరుకు అద్దంపడుతున్నది. అయితే జగిత్యాల డీఈవోగా నియమితులైన రాము తాను బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా జనగామ వాసి

ఏపీలో ముఖేశ్‌కుమార్ నియామకం

ముఖేశ్‌కుమార్

దేవరుప్పుల, నవంబర్ 29 : జనగామ జిల్లావాసి ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. దేవరుప్పుల మండలం సీతారాంపురానికి చెందిన పెండెం మనోహర్, భవాని దంపతుల కుమారుడు ముఖేశ్‌కుమార్ జూనియర్ సివిల్ జడ్జిగా ఈ నెల 27న ఏపీ హైకోర్టు నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. వీరిది చేనేత కుటుంబం. ముఖేశ్‌కుమార్ 7వ తరగతి నుంచి టెన్త్ వరకు హైదరాబాద్ మహేంద్రా హిల్స్‌లోని మాతా అమృత నందిని పాఠశాలలో, ఇంటర్ నారాయణ కళాశాల, బీటెక్ నల్లా నర్సింహారెడ్డి కళాశాల, వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ, ఉస్మానియాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

- గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట
- లంబాడా హక్కుల పోరాట సమితి ధర్నా

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : గిరిజన సంక్షేమ శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని లంబాడా హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి నాయకులు శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా కార్యాలయం ఎదుట పోలీసులు అడ్డుకున్నారు. నిరసనగా నాయకులు అక్కడే ధర్నా చేయడంతో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా ఫూల్ సింగ్ నాయక్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం జాటోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకులాల్లో 451 మంది బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగులు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 1,804 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, దాదాపు 25 ఏండ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నా వారిని ఇప్పటి వరకూ రెగ్యులరైజ్ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వారిని క్రమబద్ధీకరించే వరకు టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంటిజెన్సీ వర్కర్, దినసరి ఉద్యోగులకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు 50 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రతి కుటుంబానికీ హెల్త్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏసీబీకి చిక్కిన ల్యాండ్ అండ్ సర్వే ఉద్యోగులు

10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

నిర్మల్ అర్బన్, నవంబర్ 29 : నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయ జూనియర్ అసిస్టెంట్, అటెండర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌కు చెందిన సల్ల హరీశ్ సేత్వార్ పని కోసం ఈ నెల 5న కలెక్టరేట్‌లోని ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయానికి వెళ్లాడు. తన పని చేయాలని కోరగా రూ.20 వేల లంచాన్ని జూనియర్ అసిస్టెంట్ జగదీశ్ డిమాండ్ చేయగా, 10 వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం కార్యాలయంలో డబ్బులు తీసుకుంటుండగా జూనియర్ అసిస్టెంట్ జగదీశ్, అటెండర్ ప్రశాంత్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

విద్యార్థుల పోరుసభలో అభివాదం చేస్తున్న ఆర్ కృష్ణయ్య, విద్యార్థి సంఘం నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర

- ఒక్క పైసా బకాయిలు చెల్లించని సర్కారు
- ప్రజా విజయోత్సవాల పేరిట సంబురాలేల?
- బీసీ ఫీజుపోరు సభలో కృష్ణయ్య

రవీంద్రభారతి,నవంబర్ 29: ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య ధ్వజమెత్తారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఫీజుల పోరుసభలో ఆయన ప్రసంగించారు. పైసా ఫీజు, స్కాలర్‌షిప్పుల బకాయిలు చెల్లించకుండా విజయోత్సవ సభలు నిర్వహించడం సిగ్గుచేటని, ఏమి సాధించారని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థులు ఫీజులు చెల్లించేందుకు రక్తాన్ని, కిడ్నీలను అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లకు మాత్రం ఈ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తున్నదని, విద్యార్థుల ఫీజులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మంత్రి భట్టి విక్రమార్క స్పందించాలని, విద్యార్థుల ఫీజు, స్కాలర్‌షిప్పుల బకాయిలను చెల్లించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యార్థులను పట్టించుకోకపోతే గతంలో మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి పట్టడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ నేతలు నీల వెంకటేశ్, గొరిగె మల్లేశ్‌యాదవ్, గుజ్జ సత్యం, నందా గోపాల్, పగ్గెల సత్యం, వంశీ, చంద్రశేఖర్, మోదీ రాందేవ్, నర్సింహ, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల బలోపేతంతో బీజేపీకి అడ్డుకట్ట

- వామపక్ష శక్తుల ఐక్యతకు సీపీఐ కృషి
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తేతెలంగాణ) : మతతత్వ, పెట్టుబడిదారీ బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకు వామపక్షాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డీ రాజా పిలుపునిచ్చారు. ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో శుక్రవారం సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశం ప్రకాశ్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. వామపక్ష శక్తుల ఐక్యతకు సీపీఐ కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ తరఫున సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు నివేదిక సమర్పించారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కలవేణ శంకర్, బాలనరసింహ, ఎండీ యూసుఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.